క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

హసన్‌పర్తి: ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రతులను సీపీఎం నాయకులు ఎర్రగట్టు జంక్షన్‌లో గురువారం దహనం చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యురాలు నాంపల్లి మానిక ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో కార్మికులు, రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. నాయకులు శంకర్, పుల్లా అశోక్, స్వామి కిషన్, రాములు, యాదమ్మ, రమేష్, రమ్య, శ్రీదేవి, భీమమ్మ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి పలువురి శుభాకాంక్షలు

మడికొండ: భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డికి పార్టీ నాయకులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మధు, బెరపాక వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

హసన్‌పర్తి: ఎస్సీ వర్గీకరణను తెలంగాణ కేబినెట్ ఆమోదించడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రామంచ దయాకర్, ఎస్సీసెల్ కార్యదర్శి అశోక్, 66వ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, వీసం సురేందర్‌రెడ్డి, రవి, శ్రీనివాస్, రవి, కిశోర్, ప్రకాశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ బహూకరణ

హసన్‌పర్తి: నగరంలోని సాయి సేవా ట్రస్ట్‌కు 5 కేవీ సోలార్ రూఫ్ టాప్‌ను దాతలు బహూకరించారు. సుమారు రూ.2లక్షల విలువైన ఈ రూఫ్‌టాప్ అందజేసినవారిలో వెంకటరమణ (ఎస్ఈ, హనుమకొండ), జి.సాంబారెడ్డి(డీఈ, హనుమకొండ), ఎస్.సుబ్రమణేశ్వర రావు (ఏడీఈ, కాజీపేట), ఎన్. మల్లికార్జున్ (ఏడీఈ, హనుమకొండ), కె.రాజు (ఏడీఈ, నయీంనగర్) ఉన్నారు. వడ్డెపల్లి సబ్‌స్టేషన్ ఏఈ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల అందజేత

వరంగల్: అలియన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ అధ్యక్షుడు అల్లై దోమల నాగేందర్ ఆధ్వర్యంలో క్లబ్ లైఫ్ మెంబర్ అల్లై పొరండ్ల సతీష్ కుమార్ నగరంలోని స్వయంకృషి వృద్ధాశ్రమంలో గురువారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా అల్లై చిప్ప వెంకటేశ్వర్లు, నాయకులు మంత్రి లింగమూర్తి, గజ్జెల ఓంకార్‌లింగం శాస్త్రి, పెంట కుమార్, దస్తగిరి, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కాజీ హైస్కూల్ ఎదుట రోడ్డుపై ఏర్పడిన గుంతలను జాతీయ భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్, రోటరీ క్లబ్, హనుమకొండ, ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా రీసైక్లింగ్ మెటీరియల్‌తో గురువారం పూడ్చివేశారు. ఈసందర్భంగా విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాజు మృతదేహం

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పి.. డివైడర్‌కు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వడ్డెపల్లి–ధర్మసాగర్ మార్గంలో నిరూప్‌నగర్ తండా వద్ద గురువారం రాత్రి జరిగిన ఈఘటనకు సంబంధించి కాకతీయ యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన మాచర్ల రాజు(35), నగరంలోని ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. గురువారం విధులు ముగించుకుని బైక్‌పై ముప్పారానికి బయల్దేరాడు. నిరూప్‌నగర్ తండా పెట్రోల్ పంప్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొంది. ఈప్రమాదంలో రాజు అక్కడక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

పథకాల పేరుతో ప్రభుత్వం మోసం

వరంగల్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో పేదలను మోసం చేస్తూ.. ప్రాణాలు తీస్తున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేదని ఆత్మహత్యకు పాల్పడిన ములుగు జిల్లా బుట్టాయిగూడెంకు చెందిన కుమ్మరి నాగయ్య(నాగేశ్వర్ రావు) మృతదేహాన్ని సందర్శించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణతో పరేషాన్


ఇరుకు రోడ్డు నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు


రోడ్డు ఆనుకుని ఉన్న పండ్లబండ్లు

- కాంప్లెక్స్‌లకు అద్దె.. రోడ్డుపైన వ్యాపారాలు
- హద్దులు దాటుతున్న చిరువ్యాపారులు
- బస్టాండ్ మలుపులు సైతం ఆక్రమణ
- తప్పని ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని అధికారులు

పరకాల : పార్కింగ్ స్థలాలను ఆక్రమిస్తూ రోడ్డుపై వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేసినా మమ్మల్ని ఏం చేయలేరంటూ మరో అడుగు ముందుకు వేస్తున్నారు పట్టణంలోని చిరువ్యాపారులు. దీంతో బస్టాండ్ రోడ్డులో నడిచే ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్‌కిరువైపులా ఉన్న స్థలలాను ఆక్రమించి ఒక్కో పండ్ల వ్యాపారస్తుడు 50 గజాల నుంచి 100 గజాలకు పైగా స్థలంలో పండ్ల దుకాణాలు ఏర్పాటు చేశారు. దీంతో బస్టాండ్ లోపలికి, బయటకు వెళ్లాల్సిన బస్సులకు ఇబ్బందికరంగా మారింది. మలుపులు వద్ద ఒక్కో సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుని వాహనాదారులు, ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తమ ఉద్యోగాలు పోతాయని, పండ్ల వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆర్టీసీ కార్మికులు వాపోతున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లను గోదాంలుగా మార్చుకుని రోడ్లపై వ్యాపారాలు చేస్తుంటే అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం సరికాదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

స్థానికుల ఆగ్రహం..

రోడ్డుపైనా ఒక్క నిమిషం వాహనం ఆపితే జరిమానాలు విధించే పోలీస్‌లకు పండ్ల వ్యాపారస్తుల ఆగడాలు కనిపించడం లేదా అనే విమర్శలు స్థానికుల నుంచి వ్యక్తం అవుతున్నాయి. నడిరోడ్డుపై వ్యాపారాలు చేస్తుండడంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహిస్తున్నారు. మున్సిపల్, పోలీస్, ఆర్టీసీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

విజ్ఞాన, విహార యాత్రకు వెళ్లిన విద్యార్థులు


విజ్ఞాన, విహార యాత్రకు వెళ్తున్న విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు పీఎం శ్రీ పథకంలో భాగంగా గురువారం 9 బస్సుల్లో రామప్ప, లక్నవరం పర్యాటక ప్రాంతాలకు విజ్ఞాన, విహార యాత్రకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రామప్ప శిల్పాల చారిత్రాత్మక కట్టడాల గురించి వివరిస్తూ చారిత్రాత్మక విజ్ఞానంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రజని మాట్లాడుతూ.. విజ్ఞాన, విహార యాత్రల ద్వారా విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు విజ్ఞానం లభిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అనితాదేవి

ఎల్కతుర్తి : ఈనెల 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనితాదేవి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న జ్ఞానాన్ని ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని అన్నారు. ప్రతీ సంవత్సరం పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, ట్యాలెంట్ టెస్టులను మధురమ్మ ట్రస్ట్ ద్వారా నిర్వహించి ప్రతిభ కనబర్చి విద్యార్థులకు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునిలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

జాతీయస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థి



కమలాపూర్ : మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న పంగిడిపల్లికి చెందిన కొడగాని సుష్మ ఎస్జీఎఫ్ఐ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఎస్వో అర్చన తెలిపారు. ఎస్జీఎఫ్ఐ 68వ రాష్ట్రస్థాయి పోటీల అండర్–19 ఫెన్సింగ్ గేమ్ విభాగంలో సుష్మ ప్రతిభ కనబర్చి ఈనెల 8న పాట్నాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన సుష్మ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లడానికి, క్రీడా సామగ్రి సమకూర్చుకోవడానికి ఎస్వో అర్చన, ఉపాధ్యాయులు, సిబ్బంది, డాక్టర్ ఈటల సమ్మయ్య, గూడూరు మాజీ సర్పంచ్ అంకతి సాంబయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రమేష్, ఎన్ఆర్ఐ బోడ మల్లారెడ్డి కలిసి రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు.

వేటగాళ్లకు కౌన్సెలింగ్

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో గురువారం ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన 9మంది వేటగాళ్లు వేట సామాగ్రితో సంచరిస్తున్నారనే సమాచారంతో ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ హనుమకొండ జిల్లా సభ్యుడు మారేపల్లి సునీల్ వారిని అడ్డుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వన్య ప్రాణులను వేటాడడం, ప్రయత్నం చేయడం, వేట సామాగ్రి కలిగి ఉండడం నేరమన్నారు. అటవీ జంతువులను వేటాడడం మానుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



పరకాల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులకు అనుకూలంగా ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తు స్థానిక బస్టాండ్ కూడలిలో గురువారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురుప్రసాద్, మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జయంత్‌లాల్, మాజీ కౌన్సిలర్ పూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

టీజీసీజీటీఏ డైరీ ఆవిష్కరణ



పరకాల : అధ్యాపకులు సమన్వయంతో పనిచేసి కళాశాల అభివృద్ధికి పాటుపడాలని పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోశ్‌కుమార్ తెలిపారు. పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీజీసీజీటీఏ డైరీ ఆవిష్కరణ గురువారం జరిగింది.

ఒంటిమామిడిపల్లిలో చోరీ

మామునూరు : ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామంలో చోరీ జరిగింది. ఐనవోలు ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన పెండ్లి జైపాల్‌రెడ్డి బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబతో పొరుగూరికి వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు అదే రోజు అర్ధరాత్రి జైపాల్‌రెడ్డి ఇంటి తలుపులు, తాళం ధ్వంసం చేశారు. బీరువాలోని 2తులాల బంగారు అభరణాలు, 40తులాల వెండి పట్టీలు, రూ.5వేల నగదు అపహరించారు. గురువారం ఉదయం ఇంటికి చేరిన బాధితుడికి తలుపులు ధ్వంసం అయ్యి కనిపించాయి. దీంతో చోరీ జరిగినట్లు గ్రహించి అతడు పోలీస్‌లకు సమాచారం అందించినట్లు తెలిపారు. దీంతో క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలానికి చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. బాధితుడు జైపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫిట్స్‌తో రైతు మృతి

మామునూరు : మొక్కజొన్న పంటకు నీళ్లు కడుతున్న ఓ రైతుకు ఆకస్మత్తుగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన గురువారం రాత్రి ఐనవోలు మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన ప్రకారం .. ఐనవోలుకు చెందిన కత్తుల భిక్షపతి (56) రోజు మాదిరిగానే మొక్కజొన్న పంటకు నీళ్లు కట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు బుధవారం రాత్రి వెళ్లాడు. నీళ్లు కడుతుండగా ఆకస్మత్తుగా ఫిట్స్ వచ్చింది. దీంతో నీటిలో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం ఉదయం చెలక వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు గమనించి బోరున విలపించారు. పోలీస్‌లకు సమాచారం అందించినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

'అరూరి'కి పరామర్శ

దామెర : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్ రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట జిల్లా నాయకులు గురిజాల శ్రీరాంరెడ్డి, ముత్యాల శ్రీనివాస్, ఆ పార్టీ దామెర అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, ముల్క ప్రసాద్, మొలుగూరి శ్రీనివాస్, జాన విక్రమ్, దేవేందర్‌రెడ్డి, రమేశ్, ఏలియా, సాయికుమార్ ఉన్నారు.

'చల్లా' పరామర్శ..

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన తోట చిన్న ప్రమీల ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

దామెర : బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. మండలంలోని ఊరుగొండకు చెందిన గొంది వెంకట్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి గురువారం మృతుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ, మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కునాటి సునీల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జన్ను విద్యాసాగర్ పాల్గొన్నారు.

మిర్చి రైతును దోచుకుంటున్న ఖరీదుదారులు


ధర్నా చేస్తున్న నాయకులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతులను ఖరీదుదారులు దోచుకుంటున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, ఈసెంపల్లి బాబులు ఆరోపించారు. గురువారం మార్కెట్ ముందు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. అనంతరం యార్డులోకి వచ్చి రైతులను ధరలపై అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మిర్చి సాగు చేస్తున్న రైతులకు ధర లేక భవిష్యత్తులో ధర పై ఆశ లేకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మిర్చి క్వింటాకు రూ.25 వేలు కనీస ధర నిర్ణయం చేసి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం రూ.25 వేల ధర పలికిన ప్రస్తుతం రూ.10 నుంచి రూ.13 వేల తగ్గిపోయిందన్నారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అండగా ఏఐఎస్ఎఫ్


డైరీని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రావు

ఖిలా వరంగల్ : దేశ వ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి, వారికి అండగా నిలిచిన సంఘం ఏఐఎస్ ఎఫ్ ఒక్కటేనని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. ఈమేరకు గురువారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో జిల్లా అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన 2025 ఏఐఎస్ఎఫ్ డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధులు శివ, రమేశ్, కుమార్, శరత్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యుడి అనుగ్రహం ప్రజలపై ఉండాలి

- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి


స్వామివారిని దర్శించుకుంటున్న గండ్ర జ్యోతి

శాయంపేట : సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహం ప్రజలపై ఉండాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆకాంక్షించారు. మండలంలోని పత్తిపాకలో జరుగుతున్న నవగ్రహ, సుబ్రహ్మణేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆమె హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తులను దర్శించుకున్నారు. స్వామివారి అనుగ్రహంతో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు మోహన్, గ్రామశాఖ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, రాజేందర్, శ్రావణ్‌కుమార్, నాయకులు నందం, శ్యాంసుందర్‌రెడ్డి, కిష్టయ్య, కరణ్‌బాబు, నారాయణరెడ్డి, రామరాజు, సుభాశ్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

గుట్కా, పొగాకు విక్రయిస్తే కేసులు


పట్టుబడిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీన పర్చుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఎల్కతుర్తి : గుట్కా, పొగాకు, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తే కేసులు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఓ పాన్‌షాపులో దాడులు నిర్వహించి గుట్కా, పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లను స్వాధీన పర్చుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రానికి చెందిన తోకల శ్రీనివాస్‌కు చెందిన పాన్‌షాప్‌లో దాడులు నిర్వహించి పొగాకు ఉత్పత్తుల ప్యాకెట్లను స్వాధీన పర్చుకున్నామన్నారు. వాటి విలువ రూ.54,130 ఉంటుందని తెలిపారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ప్రభుత్వ నిషేధిత వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బందిని, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసుధన్ అభినందించారు.

చింతపండు నవీన్ క్షమాపణ చెప్పాలి

- ఐనవోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మామునూరు : రెడ్డి సామాజిక వర్గంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్‌కుమార్) క్షమాపణ చెప్పాలని రెడ్డి సంక్షేమ సంఘం ఐనవోలు మండల అధ్యక్షుడు చింతలపూరి హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఐనవోలు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కుల ఘర్షణలకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రేరిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అతడిని బహిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ధర్మసాగర్ : ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సదానందం హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో గల 1058 సర్వే నంబర్‌లో 24 గుంటల ప్రభుత్వ భూమిని మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేసి వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. ఆ భూమిని బుధవారం స్థానిక సర్వేయర్‌తో సర్వే చేపించి ప్రభుత్వ భూమిగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆ భూమిలో హద్దులు పాతి, ముళ్లకంచె ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా స్వాధీనం చేసుకున్న భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

'భగీరథ' లీకేజీలకు మరమ్మతులు చేయాలి

- డీటీకి బీజేపీ నాయకులు వినతి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మసాగర్ : మండలంలోని దేవునూర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.72 లక్షలు ఖర్చు పెట్టినా ఫలితం లేకుండా పోయిందని, పైప్‌లైన్ లీకేజీతో డ్రెయినేజీ నీరు సరఫరా అవుతోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. వెంటనే చర్యలు చేపట్టాలని గ్రామ ప్రత్యేక అధికారి, నాయబ్ తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొంగంటి సందీప్, బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు సంగెకారి యువరాజు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ స్కీం ద్వారా లక్షల రూపాయలు గ్రామ తాగునీటి అవసరాల నిమిత్తం ఖర్చుపెట్టినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రత్యేకాధికారిని కోరుతున్నట్లు చెప్పారు. అలాగే దేవునూర్ గ్రామంలో అర్హులకు ప్రధాన మంత్రి అవాస్ యోజన, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

సహపంక్తి భోజనంతో స్నేహభావం


సహపంక్తి భోజనాలు చేస్తున్న విద్యార్థులు

దామెర : మండల కేంద్రంలోని ఏకశిల ప్రైమ్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులందరిని నేలపై కూర్చోబెట్టి అరటాకు విస్తరిలో భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ డైరెక్టర్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. పూర్వకాలంలో శుభకార్యాలు జరిగినప్పుడు కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి భోజనం చేసేవారని గుర్తుచేశారు. నేటి రోజుల్లో కాలంతో పోటీ పడుతూ ఉరుకులపరుగుల జీవితంతో పాతకాలపు ఆచారాన్ని మరిచిపోకుండా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పూర్వకాలపు ఆచారాలు, అలవాట్లను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, నవీన్, స్వరూపరాణి, మమత, వినయ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేలేరు : మండలంలోని పీచర, మల్లికుదుర్ల, నారాయణగిరి, వేలేరు సబ్ స్టేషన్ పరిధిలోని చెట్ల కొమ్మలు తొలగించేందుకు అన్ని ఫీడర్‌లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.